నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 20 డిసెంబర్ 2024 | RANGAREDDY

నాంపల్లి ప్రత్యేక కోర్టు వద్ద రైతు కుటుంబాల సభ్యులు

బెయిల్ పత్రాల కోసం నిరీక్షణ

హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రత్యేక కోర్టు బుధవారం లగచర్ల ఘటనలో అరెస్టైన వారికి బెయిల్ మంజూరు చేయగా.. తమ వారిని విడిపించుకునేందుకు రోటిబండతండా, పులిచెర్లకుంటతండా, లగచర్ల, హకీంపేట, పోలేపల్లి గ్రామాలకు చెందిన రైతుల కుటుంబీకులు గురువారం నాంపల్లి ప్రత్యేక కోర్టు వద్ద పడిగాపులు కాశారు. బెయిల్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తైందని.. తమ వారు శుక్రవారం సంగారెడ్డి జిల్లాలోని కంది జైలు నుంచి విడుదలయ్యే అవకాశముందని పేర్కొన్నారు. తమ వారిని ఎప్పుడెప్పుడు కలుస్తామా.. అన్న ఆతృతతో ఉన్నట్లు వారు చెప్పారు.

-కొడంగల్, డిసెంబర్ 19

బీఆర్ఎస్, గిరిజన సంఘాల పోరాటాలతోనే..

లగచర్ల రైతులకు బెయిల్

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్

కడ్తాల్, డిసెంబర్ 19 : బీఆర్ఎస్ పార్టీ, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో చేసిన పోరాటాలతోనే లగచర్ల రైతులకు బెయిల్ మంజూరైందని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఫార్మావిలేజ్ ఏర్పాటుకు గత నెల 11న లగచర్లతోపాటు పరిసర గ్రామాల్లో భూములను సేకరించేందుకు ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులపై రైతులు దాడి చేశారనే నెపంతో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో సహా 24 మంది రైతులను అరెస్ట్ చేసి జైల్లో వేశారన్నారు. అప్పటి నుంచి బీఆర్ఎస్ పార్టీ, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామన్నారు. ఫార్మా కంపెనీల ఏర్పాటుకు పచ్చని పంట పొలాలను తీసుకోవడం తగదన్నారు.

వంటావార్పు చేస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

క్రమబద్ధీకరించాలని వంటావార్పు

14వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మె

వికారాబాద్, డిసెంబర్ 19 : విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం.. వెంటనే రెగ్యులరైజ్ చేయాలని వికారాబాద్ జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాంగ్యానాయక్ డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారానికి 14వ రోజుకు చేరుకున్నది. ఇందులో భాగంగా ఉద్యోగులు వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. సమ్మెలో వికారాబాద్ జిల్లాలోని 488 మంది సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు. తమను వెంటనే క్రమబద్ధీకరించి, పేస్కేల్ అమలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు ప్రభావతి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, డీపీవో శేఖర్, పీటీఐ రవికుమార్, ఆయా మండలాల కేజీబీవీ పాఠశాలల ఎస్‌వోలు, సమగ్రశిక్షా అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇది రైతుల విజయం

వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, డిసెంబర్ 19 : లగచర్ల ఘటనలో రైతులు, వారికి అండగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసుల నుంచి విముక్తి కలిగిందని.. ఇది లగచర్ల రైతుల విజయమని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మా విలేజ్ భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ కోసం లగచర్ల వెళ్లిన అధికారులను రైతులు అడ్డుకోగా.. రేవంత్‌రెడ్డి సర్కారు వారిపై కక్ష గట్టి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపి దాదాపుగా 37 రోజులు ఇబ్బందిపెట్టిందన్నారు. అయితే రైతుల పోరాటంతో మాజీ ఎమ్మెల్యేతో పాటు రైతులకు బెయిల్ రావడం చాలా సంతోషకరమన్నారు. గతంలోనే నరేందర్‌రెడ్డిపై పెట్టిన మూడు కేసుల్లో రెండు ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలని హైకోర్టు ఆదేశించిన విషయం మనందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

సంబురంగా స్వాగతం

- పట్నం నరేందర్‌రెడ్డికి ఎదురెళ్లి తీసుకొచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- చర్లపల్లి జైలు నుంచి విడుదలైన మాజీ ఎమ్మెల్యే
- ఆయన రాక కోసం వందలాదిగా ఎదురుచూసిన నాయకులు

లగచర్ల ఘటనలో అరెస్టైన వారికి నాంపల్లి ప్రత్యేక కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేయగా.. చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గురువారం సాయం త్రం 6.50 గంటలకు జైలు నుంచి బయటికొచ్చారు. ఆయన రాక కోసం బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు,అభిమానులు, జైలు వద్ద సాయంత్రం 5 గంటల నుంచే వందలాదిగా ఎదురుచూశారు. ఆయన బయటికి రాగానే ఎదురెళ్లి ఘన స్వాగతం పలికారు. వీరతిలకం దిద్ది, కండువాలు కప్పి భుజాలపైకి ఎత్తుకోగా ఆయన ప్రతి ఒక్కరికీ అభివాదం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు జైలు పరిసరాల్లో పటాకులు కాల్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం పట్నం నరేందర్‌రెడ్డి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు వెళ్లగా.. అక్కడ గిరిజనులు హారతిచ్చి.. పూలు చల్లి ఘన స్వాగతం పలికారు.

విశాఖ టూ వికారాబాద్..

రైల్వే కేంద్రంగా పెరుగుతున్న గంజాయి అక్రమ రవాణా

- కొరవడిన నిఘా.. రెచ్చిపోతున్న అక్రమార్కులు
- వికారాబాద్ జంక్షన్‌లో పలుమార్లు గంజాయి స్వాధీనం
- తాజాగా 28 కిలోల గంజాయిని పట్టుకున్న పోలీసులు
- ఒడిశా నుంచి వికారాబాద్, మహారాష్ట్ర, కర్ణాటకలకు తరలింపు

రైల్వే కేంద్రంగా గంజాయి అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. పోలీసులు కేవలం రోడ్డు మార్గంపైనే దృష్టి సారిస్తుండడంతో అక్రమార్కులు వారి కండ్లు కప్పి రోడ్డు మార్గంతోపాటు రైళ్లలోనూ గంజాయిని తరలిస్తున్నారు. ప్రధానంగా రైళ్లలో ఒడిశా నుంచి విశాఖ మీదుగా వికారాబాద్, వికారాబాద్ నుంచి ముంబై, పుణె, బెంగళూరుకు గుట్టుచప్పుడు కాకుండా వందల కిలోలను తరలిస్తున్నారు. రోడ్డు మార్గం కంటే రైళ్ల ద్వారానే ఈ దందా అధికంగా జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. తాజాగా లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ నుంచి అక్రమంగా తరలిస్తున్న 28 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు కర్ణాటక నుంచి రోడ్డు మార్గం ద్వారా ఈ మధ్య గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం. -వికారాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ)

రైళ్లలో నిఘా కొరవడడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. వాటిలో గంజాయితోపాటు గుట్కాను అక్రమంగా తరలిస్తున్నారు. గత నాలుగేండ్లలో గంజాయిని తరలిస్తున్న సుమారు 100 మందికిపైగా కేసులు నమోదు చేయడంతోపాటు వందల కిలోలకుపైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసుల లెక్కలు చెబుతున్నారు. డ్రగ్స్ ముఠాలు రైళ్లలో తీసుకొస్తున్న గంజాయిని జిల్లా కేంద్రంతోపాటు తాండూరు, హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు తరలిస్తూ యువతను మత్తుకు బలి చేస్తున్నారు. ఒడిశా, కర్ణాటక నుంచి జిల్లాతోపాటు హైదాబాద్‌కు గంజాయి, గుట్కాలను తరలిస్తున్నారు. పోలీసులు గంజాయిని తరలిస్తూ పట్టుబడిన వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారే తప్పా.. అసలు నిందితులను పట్టుకునే దిశగా విచారణ చేపట్టడంలేదనే విమర్శలున్నాయి. మరోవైపు జిల్లాలోని మర్పల్లి మండలంలో ఓ పార్టీకి చెందిన నాయకుడు గుట్టుచప్పుడు కాకుండా తన పొలంలో గంజాయిని సాగు చేయడంతోపాటు స్థానిక పోలీసులను మేనేజ్ చేస్తూ దానిని పుణెకు తరలిస్తున్నట్లు జిల్లా అంతటా గతేడాదిగా ప్రచారం జరుగుతున్నది.

> డ్రగ్స్ ముఠాలు అమాయకులను ఎంచుకుని వారితో రైలు మార్గం ద్వారా గంజాయిని తరలిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో పట్టుబడిన వారిని రైల్వే పోలీసులు విచారించగా.. వారంతా ఎంతో కొంత డబ్బుకు ఆశపడి గంజాయిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించినట్లు తెలిసింది. తాజాగా మంగళవారం వికారాబాద్ జంక్షన్‌లో ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయిని తరలిస్తూ పట్టుబడిన వారిది కూడా ఇదే పరిస్థితి. వీరు ఒడిశా నుంచి 28 కిలోల గంజాయిని కొంత డబ్బుకు ఆశపడి ముంబైకి తరలిస్తూ పట్టుబడ్డారు. అయితే దాని వెనుక ఉన్న సూత్రధారులు ఎవరనేది తెలియడంలేదు. రైల్వే పోలీసులు పట్టుబడిన వారి నుంచి వివరాలు సేకరించి సూత్రధారులను అరెస్టు చేస్తేనే అక్రమ గంజాయి సరఫరా ఆగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

అమాయకులే లక్ష్యంగా..

లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్‌లో 28 కిలోల గంజాయిని పట్టుకున్న పోలీసులు(ఫైల్)

రిసార్ట్‌లపై నిఘా ఏది..

వికారాబాద్ జిల్లా కేంద్రం చుట్టూ పదుల సంఖ్యలో రిసార్ట్‌లు వెలిశాయి. పెరిగిన పోటీ నేపథ్యంలో యువతను ఆకర్షించేందుకు వాటి నిర్వాహకులు గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తెలంగాణ ఊటీగా పేరొందిన అనంతగిరి చుట్టూ పక్కల వెలసిన రిసార్ట్‌లకు వీకెండ్‌లో అధిక సంఖ్యలో విద్యార్థులు, యువత వస్తుంటారు. ఇదే అదునుగా రిసార్ట్‌లలో గంజాయి గుప్పుమంటున్నట్లు సమాచారం. త్వరలో జరిగే న్యూఇయర్ వేడుకలకు గంజాయి ప్రధాన ఆకర్షణగా ఉండేలా రిసార్ట్‌ల నిర్వాహకులు ఇప్పటినుంచే ప్లాన్ చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతున్నది. తనిఖీలు చేపట్టాల్సిన పోలీసులు వారు ఇచ్చే మామూళ్లకు ఆశ పడి అటువైపు వెళ్లడం లేదనే ఆరోపణలున్నాయి. రిసార్ట్‌లలో ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప లోపల ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయనేది తెలియకపోవడం గమనార్హం.

బెట్టింగ్ ఆట.. నేరాల బాట

యువతకు వ్యసనంలా మారిన ఆన్‌లైన్ బెట్టింగ్‌లు

- చేసిన అప్పులు తీర్చలేక దారిదోపిడీలు, హత్యలు.. ఆత్మహత్యలు
- తమ బంగారు భవితను నాశనం చేసుకుంటున్న యువత
- ఆన్‌లైన్ గేములు ఆడుతున్న వారిలో అత్యధికులు టీనేజర్లే

యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలుగా మారి చేతిలో ఉన్న డబ్బంతా ఆ ఆటలకే ఖర్చుచేయడంతోపాటు.. ఇతరుల వద్ద డబ్బులు తీసుకుని అప్పుల పాలవుతున్నారు. వాటిని తీర్చే మార్గం లేక కొందరు బలవన్మరణాలకు పాల్పడుతుండగా.. మరికొందరు చోరీలు, హత్యలు కూడా చేస్తూ తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

-రంగారెడ్డి, డిసెంబర్ 19 (నమస్తేతెలంగాణ)

- ఇబ్రహీంపట్నం మండలంలోని తులేకలాన్ గ్రామానికి చెందిన శివలింగం సొమ్ముడు, మంచివాడు. ఆయన తండ్రి ప్రభుత్వ ఉద్యోగిగా ఉద్యోగ విరమణ చేశాడు. ఉన్నత విద్యాభ్యాసం చేసినా ప్రభుత్వ ఉద్యోగం రాక ఇబ్రహీంపట్నంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. త్వరలోనే వివాహం చేయాలని అతడి తల్లిదండ్రులు భావించారు. ఈ లోపు చెడు స్నేహానికి అలవాటుపడి ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వైపు దృష్టి సారించాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ అతడికి ఒక వ్యసనంగా మారింది. చేతిలో ఉన్న డబ్బంతా ఆ ఆటలకే వెచ్చించాడు. ఇతరుల వద్ద డబ్బులు తీసుకుని అప్పుల పాలై.. వాటిని తీర్చే మార్గంలేక ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. చివరకు చికిత్స పొందుతూ మృతి చెంది. కన్నవారికి తీరని శోకాన్ని మిగిల్చాడు.
- నగరంలోని బేగంపేటకు చెందిన సురేందర్ వృత్తిరీత్యా డ్రైవర్, ఉన్న దానితో కుటుంబంతో కలిసి సంతోషంగా జీవించాడు. ఈ క్రమంలో అతడికి ఆన్‌లైన్ బెట్టింగ్ రాయుళ్లు పరిచయమయ్యారు. వారితో కలిసి పెద్ద ఎత్తున ఆన్‌లైన్ గేములాడాడు. తిరిగి వెనక్కి చూసుకునే లోపే అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. చేసిన అప్పులు తీర్చే మార్గంలేక దొంగతనాలు, హత్యలు చేయాలనుకున్నాడు. అందులో భాగంగానే తన యజమానురాలి తల్లి నాదర్‌గుల్‌కు చెందిన సరోజను హత్య చేసి ఆమె వద్ద ఉన్న బంగారాన్ని తస్కరించాలనుకున్నాడు. అనుకున్నట్లే ఆమెను హత్యచేసి ఆమె వద్ద ఉన్న బంగారాన్ని తీసుకెళ్లి తాకట్టు పెట్టగా పోలీసులు కనిపెట్టి అతడ్ని కటకటాలపాలు చేశారు. అతడిపై ఆధారపడిన కుటుంబం రోడ్డున పడింది.
- నాగర్‌కర్నూల్‌కు చెందిన ఇద్దరు యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసయ్యారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున అప్పులు చేశారు. వాటిని తీర్చేందుకు మాడ్గుల రాణా పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద లింగమ్మ అనే మహిళ రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా, ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును ఎత్తుకెళ్లి దొంగలుగా మారారు.
- అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలై.. చేసిన అప్పులు తీర్చలేక రాందాస్‌పల్లి వద్ద బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలను అడ్డగించి వారి మెడలో ఉన్న బంగారాన్ని దోచుకుని దొంగలుగా పోలీసుల రికార్డులోకి ఎక్కారు. దీంతో వారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకున్నారు.

ఇలాంటి ఘటనలు జిల్లాలో ఎక్కడో ఓ చోట నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఎంతో భవిష్యత్తు ఉన్న యువ తీయువకులు ఆన్‌లైన్ బెట్టింగ్‌ల మోజులో పడి చోరులుగా మారడంతోపాటు మరికొంతమంది ఏకంగా హత్యలకే పాల్పడుతున్నారు. ఈ గేముల్లో సంపాదించిన వారు ఎవరూ లేకపోగా, అప్పులు చేసిన వారే అత్యధికంగా ఉన్నారు.

ఆడే గేములు ఇవే..

ముఖ్యంగా యువత క్రికెట్, పేకాట, హార్స్‌రైడింగ్, రూలెట్, లూడో, ఆన్‌లైన్ జూదంతోపాటు క్యాసినో కేంద్రాల్లో ఉన్న అనేక రకాల ఆటలపై బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. బెట్టింగ్‌లు నిర్వహించేవారు. ముందుగా కొంత లాభాన్ని చూపించి యువతను ఆకర్షిస్తున్నారు. ఆ తర్వాత వారి నుంచి సర్వం లాగేస్తున్నారు. అదేవిధంగా యువత ఎక్కువగా లోన్ యాప్‌లు, మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి అప్పులు తీసుకుంటున్నారు.

రుణాలు చెల్లించాలని వారు వేధించడం, బెదిరిస్తుండడం, చెల్లించలేని స్థితిలో ఉన్న వారు జిల్లాలో ఇప్పటివరకు సుమారు 20 నుంచి 25 మంది వరకు ఆత్మహత్యలు చేసుకోగా.. అనేకమంది చోరీ కేసుల్లో ఇరికి సతమతమవుతున్నారు.

యువత ఆ వ్యసనానికి దూరంగా ఉండాలి

ఎంతో భవిష్యత్తు ఉన్న యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌ల ఊబిలో పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు. ఆ వ్యసనానికి దూరంగా ఉండాలి. ఎంతోమంది అప్పులు చేసి ఆన్‌లైన్ గేములాంటి ప్రాణాలు తీసుకోవడంతోపాటు నేరాలకు పాల్పడుతున్నారు. త్వరలోనే యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తాం.

-కేపీవీ రాజు, ఇబ్రహీంపట్నం ఏసీపీ

మరో ఆరు నెలలు తప్పనిసరి

- చెరువుల నోటిఫికేషన్‌కు గడువు చాలదన్న లేక్ విభాగం
- ఇప్పటికే 570 చెరువులకు తుది నోటిఫికేషన్ జారీ

సిటీబ్యూరో, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల హద్దుల నిర్ధారణకు కనీసం మరో ఆరు నెలల గడువు పడుతుందని తెలుస్తున్నది. డిసెంబర్ నెలాఖరులోగా పనులను పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా... ఆచరణలో సాధ్యం కాదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 3,500 చెరువులకు హద్దులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను నిర్ధారిస్తూ తుది నోటిఫికేషన్ జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. అయితే కోర్టు విచారణ అనంతరం హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు నిర్వహించిన సమీక్షలో హద్దుల నిర్ధారణలో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఇప్పటికే రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో సమన్వయ లోపం, హద్దుల గుర్తింపు ప్రక్రియలో జాప్యం జరుగుతున్నది. గడిచిన ఐదు నెలలుగా కేవలం 570 చెరువులకు మాత్రమే పూర్తి చేయగలిగారు. ఈ క్రమంలో మరో ఆరు నెలల వరకు ఈ ప్రక్రియకు గడువు కోరాలని ఆదేశించినట్లు చెబుతున్నారు. గడిచిన ఐదు నెలలుగా చెరువుల హద్దుల నిర్ధారణను హైకోర్టు పర్యవేక్షిస్తున్నది. చెరువుల పరిరక్షణలో కీలకమైన హద్దుల నిర్ధారణ ప్రక్రియను పూర్తి చేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తున్నది. దీంతో మొత్తం హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 3,500కు పైగా చెరువులను డిసెంబర్ 30లోగా హద్దులు నిర్ధారించాలని ఇటీవలే హైకోర్టు ఆదేశించింది. కానీ ఈ వ్యవహారంలో హెచ్ఎండీఏ లేక్ విభాగం ఇంకా జాడ్యం వీడడం లేదు.

ఎందుకు జాప్యం జరుగుతుందంటే..?

హైకోర్టు విచారణ తర్వాత జరిగిన సమీక్షా సమావేశంలో హెచ్ఎండీఏ అధికారులు పలు కీలక విషయాలను ప్రస్తావించినట్లు తెలిసింది. ముఖ్యంగా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఆధీనంలో ఉన్న హద్దులే ప్రధాన కారణమని తెలిసింది. చెరువుల ప్రస్తుత విస్తీర్ణంతో పోల్చితే, ఆ శాఖల మ్యాపుల్లో పొందుపరిచిన వివరాలు విరుద్ధంగా ఉండడంతో కొత్త సమస్యలు వస్తున్నట్లు తేల్చారు. అయితే మూడు శాఖలను సమన్వయం చేసుకుంటూ కచ్చితమైన కొలతలతో హద్దుల నిర్ధారణ పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.